మెదక్‌లో నేడు నీటి సరఫరా బంద్

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మెదక్ మున్సిపల్ పరిధిలో సింగూరు లైన్ మరమ్మతుల కారణంగా నీటిని సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. 90 ఎంఎల్‌డీ డబ్ల్యూటీపీ పైప్ లైన్ మెయింటనెన్స్‌లో పనులు చేపట్టకుండటంతో శుక్రవారం పట్టణంలోని 32వార్డులకు మిషన్‌భగీరథ నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

లంబసింగి కాదు..
రామప్పగుట్ట..!

శీతాకాలం సూర్యోదయ వేళ మన్నెం కొండలను తలపిస్తున్న ఈ దృశ్యం లంబసింగిది కాదు.. అరకు వ్యాలీ అంతకంటే కాదు.. మన ఇస్లాంపూర్ రామప్పగుట్ట. తూప్రాన్ మండలంలో మూడు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో పొగమంచు భారీగా కురుస్తున్నది. రామప్పగుట్ట పైనుంచి చూస్తే పొగమంచు మేఘాలను కమ్మేస్తున్నట్లు కనిపిస్తున్నది. గుట్టపై వెలసిన స్వయంభు భవానీ రామలింగేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు ఈ సుందర దృశ్యాన్ని ఆస్వాదిస్తున్నారు.

-తూప్రాన్, (ఆంధ్రజ్యోతి)



చలి.. తగ్గేదేలే..!

● ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న తీవ్రత ● కోహీర్‌లో 7.4 డిగ్రీలు

కోహీర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాను చలి వదలడం లేదు. ఎనిమిది రోజులుగా పలు ప్రాంతాల్లో పది డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం పొగ మంచు కమ్మేస్తుండటంతో చలి తీవ్రత మరింత పెరుగుతున్నది. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో నవంబరు 13 నుంచి అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం కోహీర్‌లో 7.4 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. సదాశివపేట 8.2, న్యాల్కల్ 8.5, ఝరాసంగం 8.8, నల్లవల్లి 9, అల్గోల్ 9.3, కంగ్టి 9.3 కడ్పల్ 10.1, రాయికోడ్ 10.2, నిజాంపేట్ 10.2, మల్‌చేల్మ 10.3, సత్వార్ 10.4, దిగ్వాల్ 10.5, రామచంద్రపురం 10.5, జిన్నారం 10.8, ఫుల్కల్ 10.9, జహీరాబాద్ 10 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లా నర్సాపూర్ 8.7, శివ్వంపేట 8.7, దొంగల ధర్మారం 9.4, సర్దన 9.5, వాడి 9.5, కాగజ్‌మద్దూర్ 9.6, దామరంచ 9.7, నార్లాపూర్ 9.7, శివనూర్ 9.7, నాగపూర్ 9.8, కుల్చారం 9.9, వెల్దుర్తి 10.1 బుజరంపేట్ 10.2, పాతూరు 10.3, బోడగట్ 10.5, శంకరంపేట (ఏ) 10.5, మిన్‌పూర్ 10.5, మాసాయిపేట 10.6, రామాయంపేట 10.7, లింగాయిపల్లి 10.8, రాజ్‌పల్లి 10.8, చిప్పల్‌తుర్తి 10.9 టేక్మాల్ 11 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లా పోతిరెడ్డిపేట 9.2, అక్బీపూర్ 9.4, కొండపాక 9.5, అంగడి కిష్టాపూర్ 9.8, బేగంపేట 9.9, మునిగడప 10, మిరుదొడ్డి 10.2, తుక్కాపూర్ 10.3, రాంపూర్ 10.6, నంగునూరు 10.7, చిట్యాలపల్లి 10.8, గౌరారం 10.8, దౌలతాబాద్ 10.9 డిగ్రీలుగా నమోదైంది.



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

నీరే మనుగడకు ఆధారం

సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మనిషి మనుగడకు నీరే ఆధారమని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. నీటి వనరుల సంరక్షణపై కలెక్టరేట్‌లో అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో తాగు, సాగునీరు పుష్కలంగా లభిస్తున్నప్పటికీ నిలువ చేసేందుకు అవకాశాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటే పరిస్థితులు తలెత్తుతాయన్నారు. భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంకుడుగుంతలను ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాలు పెంచుకోవచ్చని సూచించారు. కొన్ని పరిశ్రమలు వర్షం పడే సమయంలో వ్యర్థ జలాలను చెరువులు, కుంటల్లోకి వదిలి నీటిని కలుషితం చేస్తున్నాయన్నారు. దీనిని అరికట్టే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. జిల్లాలో నీటి సంరక్షణకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. సమావేశంలో అదనపు డీఆర్‌డీవో బాలరాజు, భూగర్భజల అధికారి మోహన్, డీపీవో సాయిబాబా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల పాలకవర్గాల
పదవీకాలం పొడిగింపు



ఉత్తర్వులు అందుకుంటున్న బాచేపల్లి పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సంగారెడ్డి

కల్హేర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కల్హేర్, నిజాంపేట మండలాల పరిధిలోని మూడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలాన్ని హైకోర్టు ఆదేశాలమేరకు పొడిగిస్తూ సంగారెడ్డి జిల్లా సహకారశాఖ అధికారి కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి, మండల కేంద్రమైన కల్హేర్, కృష్ణాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం పొడిగించారు. పర్సన్ ఇన్‌చార్జి కమిటీలుగా పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు బాచేపల్లి, కృష్ణాపూర్ చైర్మన్లు పట్లోళ్ల సంగారెడ్డి, కృష్ణాగౌడ్‌కు ప్రొసీడింగ్స్ అందజేశారు. రాజకీయ కక్షతో తమకు ఇతర పీఏసీఎస్‌ల పాలకవర్గాలతో పాటు కొడిగింపు ఇవ్వకుండా రద్దు చేయించారని సదరు పాలకవర్గాలు కోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు ఆదేశాలమేరకు ఆయా పాలకవర్గాల పదవీకాలాన్ని పొడిగించినట్లు చైర్మన్లు తెలిపారు. ఎన్నికలు నిర్వహించే ఇన్‌చార్జిలుగా కొనసాగనున్నట్లు తెలిపారు.

యాసంగిలో వరి విస్తీర్ణం

2,95,200 ఎకరాలు



● గత సీజన్ కంటే 10 శాతం అధికం ● మెదక్ జిల్ల యాసంగి సాగు ప్రణాళిక సిద్ధం

మెదక్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మెతుకుసీమలో రైతన్నలు యాసంగి సీజన్‌లోనూ వరి సాగుకే ఆసక్తి కనబరుస్తున్నారు. గతేడాది కంటే ఈ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం పది శాతం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. 2025-26 యాసంగి సీజన్‌లో సాగు ప్రణాళికను మెదక్ జిల్లా వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేశారు.

మొత్తం పంటలు 3,17,380 ఎకరాలు

మెదక్ జిల్లాలో 2025-26 యాసంగి సీజన్‌లో పంటలన్నీ కలుపుకుని 3,17,380 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతాయని వ్యవసాయ ప్రణాళికలో పేర్కొన్నారు. ఇందులో అత్యధికంగా 2,95,200 ఎకరాల్లో వరి సాగు చేస్తారని పేర్కొన్నారు. (గతేడాది యాసంగిలో 2,75,489 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈసారి 10 శాతం అధికంగా నాట్లు వేస్తారని అంచనా వేస్తున్నారు.) వరి తరువాత అత్యధికంగా జొన్న పంటను 9,980 ఎకరాల్లో సాగు చేయనున్నారు. మొక్కజొన్న 3,100 ఎకరాలు, పొద్దుతిరుగుడు 568 ఎకరాలు, వేరుశనగ 119 ఎకరాలు, కూరగాయల పంటలు 1,200 ఎకరాలు, ఆయిల్‌పామ్ 1,725 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు అధికారులు ప్రణాళికలో పేర్కొన్నారు. ఒకప్పుడు జిల్లాకే తలమానికమైన చెరుకు పంట 60 ఎకరాలకే పరిమితం కావడం గమనార్హం. మిగిలిన విస్తీర్ణంలో కంది, పెసర, రాగులు, ఇతర పంటలు సాగవుతాయని ప్రణాళికలో పేర్కొన్నారు.

ఎరువులు, విత్తనాలు సిద్ధం

ఈసారి చెరువులు, కుంటలు జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. దీంతో యాసంగి సాగుకు జిల్లాలో అనుకూల వాతావరణం నెలకొంది. దీంతో ఈ సారీ అంచనాలకు మించి పంటల సాగు చేసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఎమ్ఎన్, ఎఫ్ఎమ్ కెనాళ్ల పరీవాహక ప్రాంతాలైన మెదక్, పాపన్నపేట, హవేలీఘనపురం, కొల్చారం మండలాలోని వ్యవసాయ క్షేత్రాల్లో వందశాతం వరి సాగు చేస్తారు. రేగోడ్, అల్లాదుర్గం, టేక్మాల్, పెద్ద శంకరంపేట, తదితర మండలాల్లో జొన్న, పెసర, కంది, బెబ్బెర పంటలు సాగుచేస్తారు. కొన్ని మండలాల్లో మొక్కజొన్న, వేరుశనగ పంటలు విత్తుతున్నారు. డిసెంబరు 3వ వారంలో వరి నాట్లు ప్రారంభమవుతాయని అంచనా వేస్తున్నారు. రైతులు ఇబ్బంది పడకండా అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

కావాల్సిన విత్తనాలు (క్వింటాళ్లలో)

వరి	73,800
జొన్న	299
మొక్కజొన్న	248
పెసర	78
సన్‌ఫ్లవర్	12

అవసరమయ్యే ఎరువులు (మెట్రిక్ టన్నులు)

యూరియా	27,054
డీఏపీ	2,050
ఎమ్‌వోపీ	2,343
కాంప్లెక్స్	24,041
ఎస్ఎస్‌పీ	1,025
మొత్తం	56,523

'ఏడుపాయల'
హుండీ ఆదాయం రూ.29.92 లక్షలు

పాపన్నపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గామాత ఆలయ హుండీ ఆదాయం రూ.29,92,712 వచ్చినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. 101 రోజుల హుండీని గురువారం వెంకట అన్నమాచార్య సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో ఏడుపాయలలో లెక్కించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సులోచన, మెదక్ ఇండియన్ బ్యాంక్ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి చాక్లెట్లు స్వాధీనం

పటాన్‌చెరు నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పాన్‌షాపులో గంజాయి చాక్లెట్లను విక్రయిస్తుండగా ఐడీఏ బొల్లారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం బద్రక్‌కు చెందిన అజయ్‌కుమార్ దాస్ ఇరవై సంవత్సరాలుగా ఐడీఏ బొల్లారంలో నివాసముంటూ పాన్‌షాప్ నడుపుతున్నాడు. పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు గంజాయి చాక్లెట్‌లు విక్రయిస్తున్నాడు. ఒక్కో చాక్లెట్ రూ.20 చొప్పున అమ్ముతున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న ఐడీఏ బొల్లారం పోలీసులు గురువారం పాన్‌షాప్‌పై దాడిచేసి 238 చాక్లెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

వసతిగృహంలో మెదక్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

దుప్పట్ల పంపిణీ జరిగిందా లేదా అని ఆరా

పరిసరాల పరిశుభ్రత, నిర్వహణపై అసహనం

మెదక్ అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహాన్ని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు కొత్త దుప్పట్ల పంపిణీ జరిగిందా లేదా అని ఆరా తీశారు. వసతి, భోజనం, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆహార నాణ్యత, భోజన తయారీ, పరిసరాల పరిశుభ్రత, నిర్వహణపై నిర్లక్ష్యంగా ఉన్నారని సిబ్బందిపై అసహనం వ్యక్తంచేశారు. నిబంధనలను కచ్చితంగా పాటించాలని, విద్యార్థులకు అన్ని వసతులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యలుంటే తనదృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై గురువారం ఆయన అధికారులతో గూగుల్‌మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 492 గ్రామపంచాయతీలు, 4,220 వార్డులకు ఎన్నికల కమిషన్ త్వరలో నోటిఫికేషన్ జారచేసే అవకాశ ఉందని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికారులందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు.

రైస్‌మిల్లర్ల గుండెల్లో రైళ్లు!

సంగారెడ్డి జిల్లాలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

సన్నబియ్యం సరఫరాతో సీఎంఆర్ పక్కదారి

భారీగా బకాయి పడిన మిల్లర్లు



నారాయణఖేడ్ డివిజన్‌లోని ఓ రైస్‌మిల్లు

నారాయణఖేడ్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలతో రైస్‌మిల్లర్లలో గుండెల్లో గుబులు మొదలైంది. గత సంవత్సరం వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి వడ్లు సరఫరా చేస్తే.. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ ధాన్యాన్ని సరఫరా చేయకపోవడంతో పలువురు మిల్లర్లకు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేస్తుండడంతో సీఎంఆర్ బియ్యం పక్కదారి పట్టించారు. ప్రస్తుతం ప్రభుత్వం సీఎంఆర్ జమ చేయాలని నోటీసులు ఇవ్వడంతో ఆందోళన చెందుతున్నారు. 2024-2025 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం వానాకాలానికి సంబంధించి 63 రైస్‌మిల్లులకు 1,59,491 మెట్రిక్ టన్నులు వడ్లు సరఫరా చేశారు. దీనికి సంబంధించి ఇప్పటివరకు 96,744 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు సరఫరా చేశారు. ఇంకా 31 మంది రైస్ మిల్లర్లు 11 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉంది. 2024-2025 యాసంగికి సంబంధించి 32 మంది మిల్లర్లు 1,54,120 మెట్రిక్ టన్నుల ధాన్యం సరఫరా చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 59,247 వేల మెట్రిక్ టన్నుల బియ్యంను మాత్రమే సరఫరా చేశారు. 32 రైస్ మిల్లుల వారు ఇంకా 44,938 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని చెల్లించాల్సి ఉంది. జిల్లాలో వానాకాలం, యాసంగికి సంబంధించి ప్రభుత్వానికి 58 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఇచ్చిన గడువు కూడా ఇటీవలే పూర్తయింది. దీంతో కొందరు మిల్లర్లు ప్రస్తుత సీజన్‌లో తక్కువ ధరకు వడ్లు కొనుగోలు చేసి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన లోటును పూడ్చడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈవిషయం తెలియడంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మూడు రోజులుగ క్రితం కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో రెండు రైస్ మిల్లులపై దాడులు చేసి నిల్వలను తనిఖీ చేశారు. ఓ మిల్లులో 40,834 క్వింటాళ్ల బస్తాల ధాన్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. మరో రైస్‌మిల్లులో 3,313 క్వింటాళ్ల ధాన్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించి, రెండు కేసులు నమోదు చేశారు. ఈ రెండు మిల్లుల్లో తనిఖీ చేయడంతో దాదాపు రూ.10 కోట్ల చిలుకు విలువ చేసే సీఎంఆర్ ధాన్యం లోటుగా ఉందని గుర్తించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాకు మెమోలు

మహిళా, శిశు సంక్షేమాధికారి తనిఖీలో వెలుగుచూసిన లోపాలు

పుల్‌కల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు జిల్లా మహిళ, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి లలితాకుమారి మెమోలు జారీ చేశారు. పుల్కల్ మండలంలోని గొంగ్లూరు, గొంగ్లూరు తండా, ఇసోజీపేట, కోడూరు, మిన్‌పూర్ గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గొంగ్లూరు తండాలో కార్యకర్త భారతమ్మ, పిల్లలకు ఆటలు, పాటలు నేర్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, బుధవారం విధులకు గైర్హాజరై, గురువారం సెలవుపై వెళ్లినట్లు గుర్తించారు. మిన్‌పూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం-3 కార్యకర్త లక్ష్మీ విధుల పట్ల అలసత్వం ప్రదర్శించారంటూ మెమోలు జారీ చేశారు. పిల్లలతో ఆటలు ఆడించి, పాటలు పాడించారు. కేంద్రాలు అపరిశుభ్రంగా ఉండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సరుకులు నిల్వ వివరాలు ఎప్పటికప్పుడూ రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. పిల్లలకు అందించే పౌష్టికాహారం కేంద్రాల్లోనే ఉంచాలని బయటకు తీసుకురావద్దన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గొంగ్లూరు తండాలో చిన్నారులతో మెదక్ జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి లలితాకుమారి

ఒక్క భవనం కోసం
జాతీయ రహదారి విస్తరణకు బ్రేక్

మూడు రోడ్ల మళ్లింపుతో తరచూగా రోడ్డు ప్రమాదాలు



కలెక్టరేట్ ఎదుట అడ్డదిడ్డంగా దూసుకొస్తున్న వాహనాలు

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలోనే జాతీయరహదారి విస్తరణ నిలిచిపోయినా అధికారులు స్పందించడం లేదు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించకపోవడంతో రోడ్డుకు భవనాన్ని తొలగించడానికి యజమాని అంగీకరించకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు దిక్కులా వాహనాలు ఒకేచోటి నుంచి మళ్లించడంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. రామాయంపేట మీదుగా మెదక్ వరకు జాతీయ రహదారి విస్తరిస్తున్నారు. ఈ పనులు మెదక్ కలెక్టరేట్ వద్ద నిలిచిపోయాయి. ఇప్పటికే స్థలాలు కోల్పోతున్నవారికి నష్టపరిహారం చెల్లించగా.. ఒక్క భవన యజమానికి మాత్రం నష్టపరిహారం చెల్లించకపోవడంతో పనులు వాయిదా పడ్డట్లు జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో అటు రామాయంపేట వైపు.. ఇటు మెదక్ వైపు.. మరోవైపు కలెక్టరేట్ నుంచి మెదక్ వైపు మార్గంలో వాహనాలన్నీ ఒకే రోడ్డులోకి మళ్లించారు. దీంతో ఆ జంక్షన్‌లో వాహనాలు ఒకేదారిలో వచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయి. రూ. 15లక్షలు పరిహారం చెల్లిస్తే భవనం పంచాయితీ తీరుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.



విస్తరణ నిలిచిపోయిన రోడ్డుకు అడ్డంగా సూచిక బోర్డులు

యువకుడి అదృశ్యం



నల్ల పరమేశ్

చేగుంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండల పరిధిలోని వడియారం గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమైన సంఘటన చోటుచేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నల్ల పరమేశ్(25) ఈ నెల 18న అర్ధరాత్రి ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. రెండు రోజులుగా బంధువుల వద్ద, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి నల్ల యాదమ్మ గురువారం చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్కీడ్రా పేరుతో వసూళ్లు.. ఇద్దరిపై కేసు



లక్కీ డ్రా కోసం ముద్రించిన కరపత్రం

జగదేవ్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): లక్కీ డ్రా పేరుతో డబ్బు వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు జగదేవ్‌పూర్ ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ధర్మారం గ్రామానికి చెందిన క్రాంతి కొండపోచమ్మలోని తన 120 గజాల ప్లాట్‌ను కేవలం రూ.500కే లక్కీ డ్రా ద్వారా ఇస్తున్నట్లు సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రామ్‌లో ఇన్‌ఫ్లూయెన్సర్‌తో ప్రచారం చేయించి కొంత మంది వద్ద డబ్బులు వసూలు చేశాడు. అదేవిధంగా జగదేవ్‌పూర్ గ్రామానికి చెందిన ఖలీం 195 గజాల ఇంటి స్థలాన్ని కేవలం రూ.1499 కూపన్ కొనుక్కొని సొంతం చేసుకోవాలంటూ ప్రచారం నిర్వహించి డబ్బు వసూలు చేశాడు. ప్రజలను తప్పుదారి పట్టిస్తూ కూపన్లు విక్రయించడం ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్ ఆక్ట్ ప్రకారం నేరమని, ఈ మేరకు వారిద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కూపన్ల పేరిట లక్కీడ్రా పేరిట ప్రజలను మోసం చేయాలని చూస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఎస్సై సూచించారు.

రేకుల షెడ్‌పై నుంచి పడి కార్మికుడి మృతి

పటాన్‌చెరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కంపెనీలో షెడ్‌పైభాగంలో రేకులు మారుస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి ఓ కార్మికుడు చనిపోయిన సంఘటన ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బిహార్ రాష్ట్రం బక్సర్ జిల్లా కేంద్రానికి చెందిన కృష్ణాసింగ్‌జీ ఐడీఏ బొల్లారంలో నివాసం ఉంటూ స్థానిక పారిశ్రామికవాడలోని రాణా డైకాస్ట్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నారు. గురువారం కంపెనీ షెడ్ పైభాగంలో రేకులు మారుస్తుండగా జారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. సోదరుడు శివ్‌జీసింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సెల్‌ఫోన్ విషయంలో తండ్రితో గొడవ.. కూతురి ఆత్మహత్య



మహాలక్ష్మి మృతదేహం

మాసాయిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్ విషయంలో తండ్రితో గొడవపడి కూతురు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలో చోటుచేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేటకు చెందిన నాగరాజుగౌడ్ కూతురు మహాలక్ష్మి (19) సెల్ ఫోన్ వినియోగం విషయంలో కుటుంబ సభ్యులతో గొడవపడింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహాలక్ష్మి గురువారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ.. చికిత్స పొందుతూ మృతి



షాజాన్‌బీ (ఫైల్)

రాయపోల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. రాయపోల్ ఎస్సై మానస తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండలం సయ్యద్‌నగర్ గ్రామానికి చెందిన షాజాన్‌బీ(26) డబ్బుల విషయంలో తన తోటి కోడలు దూషించడంతో మనస్తాపం చెంది ఈ నెల 10న ఇంట్లో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. తీవ్రంగా గాయపడిన ఆమెను గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్




కేసు వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్


గజ్వేల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15న గజ్వేల్ మండలం పిడిచెడ్‌కు చెందిన బీనమైన శ్రీనివాస్ తన ఇంటికి తాళం వేసి పనికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా ఉండడంతో గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు గజ్వేల్ అదనపు ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు, ఎస్సై మల్లారెడ్డి, ఏఎస్ఐ యాదగిరి, ఉమర్, కానిస్టేబుళ్లు నరేంద్ర, సురేందర్, రవి, మహిళా కానిస్టేబుల్ దివ్య గాలింపు చర్యలు చేపట్టారు. పిడిచెడ్ గ్రామానికి చెందిన బీనమైన పెద్దనాగులును అరెస్ట్ చేసి, వివరాలు రాబట్టారు. అతని వద్ద నుంచి 25 తులాల వెండి పట్టగొలుసులు, 1.4 గ్రాముల బంగారు ముక్కు పుడక, రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

గుమ్మడిదల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల ఎక్స్ రోడ్డులో నవంబరు 19న నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడిపిన గుమ్మడిదల గ్రామానికి చెందిన ఎరపుల శ్రీనివాస్‌ను పోలీసులు పట్టుకున్నారు. అతడిని గురువారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ మూడు రోజుల జైలు శిక్ష విధించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని, ఎవరూ ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని గుమ్మడిదల ఎస్సై లక్ష్మీకాంత్‌రెడ్డి హెచ్చరించారు.




















భళా.. బాల వైజ్ఞానిక ప్రదర్శన



సిద్దిపేటలో ప్రదర్శన గురించి వివరిస్తున్న విద్యార్థి

- సంగారెడ్డి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి 12 ప్రదర్శనలు ఎంపిక
- ముగిసిన మూడు రోజుల సైన్స్ ఫెయిర్.. విజేతలకు జ్ఞాపికలు అందజేత

నారాయణఖేడ్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయికి 12 ప్రదర్శనలను ఎంపిక చేసినట్లు సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. నారాయణఖేడ్‌లో ఈ నెల 18వ తేదీ నుంచి జరుగుతున్న 53వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీఈవోతోపాటు నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగంలో ఎంత ఎదిగితే దేశం అంత అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ సాంకేతికంగా అభివృద్ధి చెందినప్పుడే దేశం ముందుకు సాగుతుందన్నారు. అదనపు కలెక్టర్ ఉమా హారతి మాట్లాడుతూ సైన్స్ వివిధ రంగాల్లో ఎదగడానికి దోహదపడుతుందన్నారు. డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరిని అభినందించారు. ఈ ప్రదర్శనలో మొత్తం 713 నమూనాలను ఏర్పాటు చేశారని, వాటిలో 30 ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేశామని తెలిపారు. ఇన్‌స్పైర్ అవార్డు విభాగంలో ప్రదర్శించిన 116 నమూనాలకు గాను రాష్ట్ర స్థాయికి 12 ప్రదర్శనలు ఎంపికయ్యాయన్నారు. మూడు రోజుల్లో జిల్లా నలుమూలల నుంచి మొత్తం 13,742 మంది విద్యార్థులు ఈ సైన్స్ ఫెయిర్‌ను తిలకించారని పేర్కొన్నారు.అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందించారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు భోజనాలు, ఇతర సదుపాయాలు కల్పించినందుకు తక్షిలా పాఠశాల కరస్పాండెంట్ శరత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకట్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, డీసీబీ కార్యదర్శి లింబాద్రి, రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కళింగక్రిష్ణకుమార్ పాల్గొన్నారు.



సిద్దిపేటలో నమూనాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు



సిద్దిపేటలో నమూనాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు



నారాయణఖేడ్ : సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించిన వారికి జ్ఞాపికలు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితరులు

సిద్దిపేటలో వైజ్ఞానిక సంబురం

సిద్దిపేట కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన రెండో రోజూ కొనసాగింది. వివిధ స్టాల్స్‌లో విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్స్ అందరినీ ఆలోచింపజేశాయి. గురువారం వివిధ పాఠశాలలకు చెందిన 4,815 మంది విద్యార్థులు ప్రదర్శనను తిలకించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ప్రత్యేక పర్యవేక్షణ అధికారి సోమిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్‌వో కల్లేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారులపై అగ్నిప్రమాదాలు

- ఇంజన్‌లో మంటలు చెలరేగి లారీ
- మరో ఘటనలో కారు దగ్ధం
- ప్రయాణికుల అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం



సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామ పరిధిలో కాలిపోతున్న లారీ

కోహీర్/చిన్నకోడూరు నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల పరిధిలోని జాతీయ రహదారులపై వరుసగా రెండు అగ్నిప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో ఒక లారీ, ఒక కారు పూర్తిగా దగ్ధమయ్యాయి. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామం పరిధిలో గల 65వ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి ఓ లారీ పూర్తిగా దగ్ధమైంది. కర్ణాటక నుంచి బైండింగ్ వైర్ల లోడుతో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ దిగ్వాల్ దాటిన తర్వాత ఇంజన్‌లో నుంచి పొగలు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ లారీని రోడ్డు పక్కన ఆపి కిందికి దిగిపోయాడు. క్షణాల్లో మంటలు పెద్దవిగా మారి, లారీ మొత్తం వ్యాపించాయి. సమాచారం అందుకున్న కోహీర్ పోలీసులు, జహీరాబాద్ అగ్నిమాపక శాఖ వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే లారీ పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ.30లక్షల మేర నష్టం వాటిల్లినట్లు డ్రైవర్ తెలిపాడు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై గురువారం కారులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. కరీంనగర్‌కు చెందిన జమీల్ అహ్మద్ తన కుటుంబ సభ్యులతో కారులో సిద్దిపేటకు వెళ్తుండగా, ఇబ్రహీంనగర్ శివారులోకి రాగానే కారు ఒక్కసారిగా ఆగిపోయి పొగలు వచ్చాయి. అప్రమత్తమైన జమీల్ అహ్మద్ తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో నుంచి కిందకి దిగారు. క్రమంగా కారులో మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే పోలీసులకు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. పోలీసులు వివరాలు సేకరించారు. కారులో ఉన్నవారు ముందే అప్రమత్తమై కిందికి దిగడంతో పెను ప్రమాదం తప్పింది.





చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ శివారులో దగ్ధమైన కారు

అగ్నివీర్‌కు సింగూరు గురుకుల విద్యార్థుల ఎంపిక

పుల్కల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుల్కల్ మండలం సింగూరు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌కు ఎంపికయ్యారు. మునిపల్లి మండలం మనసానిపల్లి గ్రామానికి చెందిన బోయిని శివకుమార్ (ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం), మనూరు మండలం బోరంచ గ్రామానికి చెందిన బేగరి అరుణ్‌కుమార్ (ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థి) ఈ నెల 10, 11 తేదీల్లో హనుమకొండలో జరిగిన ఆర్మీ ర్యాలీలో వివిధ విభాగాల్లో తమ ప్రతిభను కనబర్చి అగ్నివీర్‌కు ఎంపికయ్యారు. త్వరలో వీరు శిక్షణకు తరలివెళ్లనున్నారు.

పలు క్రీడాపోటీలలో సత్తా

భువనగిరి, పటాన్‌చెరు, జహీరాబాద్, మెదక్‌లలో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో సింగూరు గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ ఫైనల్ పోటీల్లో పాల్గొని ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా నిలిచారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ అండర్ 19 విభాగంలో అజయ్‌కుమార్, ప్రణయ్ అత్యంత ప్రతిభను కనబర్చారు. హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగిన అండర్ 14 అథ్లెటిక్స్‌లో నితీష్, హనుమకొండలో అండర్ 17 అథ్లెటిక్స్‌లో రిషిఅరుణ్ వర్ధన తమ సత్తాను ప్రదర్శించారు. అలాగే, రాష్ట్ర స్థాయిలో అండర్ 17 అసోసియేషన్ క్రీడల్లోనూ మల్లేశం, రామ్‌చరణ్ నైపుణ్యాన్ని కనబర్చారు. సికింద్రాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ సబ్ జూనియర్ విభాగంలో సుమిత, నితీష్, మాణిక్యం పాల్గొనగా, పటాన్‌చెరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖోఖో జూనియర్ విభాగంలో శ్యామ్, యాదుల్, అరుణ్, ప్రశాంత్‌లు క్రీడా ప్రతిభను చాటారు. దీంతో పాటు, హత్నూరలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్యాంపస్‌లో జరిగిన 11వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో అండర్ 19, 17, 14 విభాగాల్లోనూ సింగూరు విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. విద్యార్థులు అగ్నివీర్‌కు ఎంపిక కావడం, స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ కనబర్చడంపై ప్రిన్సిపాల్ ఆగమయ్య, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది సంతోషం వ్యక్తం చేసి అభినందించారు



ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఆగమయ్య, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ, అధ్యాపకులు

పలు రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



చేగుంట : రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చేగుంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చేగుంట మోడల్ స్కూల్‌లో గురువారం ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్జీఎఫ్ ఫెన్సింగ్ పోటీలు జరిగాయి. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ ఈ పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొనగా, వారిలో మొత్తం 72 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి టోర్నమెంట్లకు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 25 వరకు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని ఆర్గనైజింగ్ సెక్రటరీలు నాగరాజు, సౌందర్య, శ్రీనివాస్, గణపతి, సమ్మయ్య, గణేష్, రవికుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో మెదక్ జిల్లా ప్రతిభను చాటాలని వారు క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెఫరీలు మల్లీశ్వరి, కౌండిన్య, రవి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు మంజీర విద్యార్థులు..

రామాయంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలలో రామాయంపేట మంజీర విద్యాలయం విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. బుధవారం సాయంత్రం వరకు మెదక్ పట్టణంలో జరిగిన అండర్-17 విభాగం పోటీలలో మంజీర విద్యాలయానికి చెందిన అభివరుణ్, వినయ్ జడ్చర్లలో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు.

యోగా పోటీల్లో ఆకునూరు విద్యార్థుల ప్రతిభ

చేర్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ఆకునూరు జడ్పీఎస్ఎస్‌కు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఇటీవల కరీంనగర్ జిల్లా వెలిశాలలో నిర్వహించిన ఈ పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎన్. సాత్విక, పి. అవంతిక జిల్లా జట్టు తరఫున పాల్గొన్నారు. సాత్విక అండర్-17 బాలికల ఆర్టిస్టిక్ యోగా సింగిల్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించింది. సాత్విక, పి. అవంతిక ద్వయం యోగా పెయిర్, రిథమిక్ యోగా పెయిర్ అండర్-17 బాలికల విభాగాలలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ మేరకు గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయులు, ఏఏపీసీ సభ్యులు అభినందించారు.



చేర్యాల : విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తహసీల్దార్ కార్యాలయంలో యువ రైతు ఆత్మహత్యాయత్నం

- భూమి పట్టా కోసం అఘాయిత్యం
- అడ్డుకున్న సిబ్బంది
- పట్టాదారుల అంగీకారంతో పట్టా మార్పిడికి హామీ



ఒంటిపై పెట్రోలు పోసుకున్న రైతు దూడ మల్లేశం

పుల్‌కల్, నవంబరు 20 ((ఆంధ్రజ్యోతి) : అరవై మూడేళ్లుగా తాము కబ్జాలో ఉన్న భూమికి పట్టా అమలు కావడం లేదంటూ సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఓ యువ రైతు ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. చౌటకూర్ గ్రామానికి చెందిన దూడ సిద్దయ్య కుటుంబం సర్వే నంబరు 1527, 1531లో 37 గుంటల భూమిని, 1962-63 నుంచి కబ్జాలో ఉంటూ సాగుచేసుకుంటున్నారు. పట్టాదారు కాలంలో పర్వతగారి లింగారెడ్డి పేరు ఉన్నప్పటికీ, అనుభవదారు కాలంలో దూడ సిద్దయ్య పేరు నమోదై ఉంది. సిద్దయ్య మరణాంతరం ఆయన కుమారులు దూడ మాణయ్య, మల్లేశం సాగు చేస్తున్నారు. 2007లో సింగూరు ప్రాజెక్టు కాలువ తవ్వకంలో ఎనిమిది గుంటల భూమిని కోల్పోగా, అప్పుడు కబ్జాదారులుగా ఉన్న దూడ మాణయ్య, మల్లేశంకు అధికారులు విచారణ జరిపి రూ.47వేలు నష్టపరిహారం చెక్కును అందజేశారు. అయినప్పటికీ, మిగిలిన 29 గుంటల భూమిని తమ పేరున అమలు చేయాలంటూ దూడ మాణయ్య అతని కుమారుడు దూడ మల్లేశం ఏళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. కలెక్టర్ మొదలుకుని ఆర్డీవో, తహసీల్దార్ వరకు వినతులు ఇచ్చి విసిగి వేసారిపోయాడు. ఈ నేపథ్యంలో, తన ఆత్మహత్యతోనైనా భూమిని అమలు చేస్తారేమోనని భావించిన మల్లేశం, గురువారం పెట్రోలు డబ్బా, సూసైడ్ నోట్ తీసుకుని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. ముందుగా తహసీల్దార్ నామాల కిష్టయ్య ఛాంబర్‌లోకి వెళ్లి ఆయనకు సుసైడ్ నోట్ ఇచ్చి, ఒంటిపై పెట్రోలు పోసుకున్నాడు. అక్కడే విధుల్లో ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ మీనా వెంటనే అప్రమత్తమై పక్క గదిలో ఉన్న నయాబ్ తహసీల్దార్ శ్రీమాన్, గిర్దావర్ ప్రమోద్‌కుమార్‌లకు చెప్పడంతో వారు అక్కడికి చేరుకుని మల్లేశం ఒంటిపై నీళ్లు పోసి అదుపు చేశారు.

కుదిరిన రాజీ

ఈ విషయమై రెవెన్యూ అధికారులు పట్టాదారులైన లింగారెడ్డి కుటుంబ సభ్యులను పిలిపించి మాట్లాడారు. చాలా రోజులుగా దూడ సిద్దయ్య కుటుంబీకులే కబ్జాలో ఉన్నది నిజమేనని వారు అంగీకరించారు. దీనిపై ఇరువర్గాల మధ్య చర్చలు జరిగాయి. పది రోజుల్లోగా పట్టా మార్పిడి చేసిస్తామంటూ లిఖితపూర్వకంగా లింగారెడ్డి కుటుంబ సభ్యులు రాసివ్వడంతో ఇరువర్గాల మధ్య రెవెన్యూ అధికారులు రాజీ కుదిర్చి గొడవను సద్దుమణిగించారు.

కేతకీలో భక్తుల కోలాహలం



ఝరాసంగం : స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

- మాజీ డీజీపీ దినేశ్ రెడ్డి పూజలు

ఝరాసంగం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా భక్తుల ప్రత్యేక పూజలతో ఆలయ ఆవరణం కోలాహలంగా మారింది. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల కోసం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ చంద్రశేఖర్, ఆలయ ఈవో శివరుద్రప్ప ప్రత్యేక చర్యలు చేపట్టారు. కేతకీ ఆలయంలో మాజీ డీజీపీ దినేశ్ రెడ్డి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. ఆలయ అధికారులు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

బగలాముఖిని దర్శించుకున్న మధుయాష్కి

శివ్వంపేట, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అమావాస్య, కార్తీక మాసం చివరి రోజు సందర్భంగా బుధవారం శక్తిపీఠం శ్రీ బగలాముఖి అమ్మవారిని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు దర్శించుకున్నారు. ఆలయ పూజారి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, మహామంత్రహవనం నిర్వహించారు. మాజీ ఎంపీ మధు యాష్కి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి కమలేష్ పండిత్ ఆలయ విశిష్టతను మధు యాష్కీకి తెలియజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, తాజా మాజీ జడ్పీటీసీ మహేష్ గుప్తా, నాయకులు పాల్గొన్నారు.

కలియదున్నితే కలదు బలం



- వరికొయ్యలను తగలబెడితే భూసారానికి నష్టం
- మేలు చేసే సూక్ష్మజీవులు, కీటకాలు నశిస్తాయి
- కాలుష్యంతో పర్యావరణానికీ ముప్పు
- పొలంలోనే కలియదున్నాలంటున్న నిపుణులు

తొగుట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరిపంట కోసిన తర్వాత మిగిలిన వరి కొయ్యలను కాల్చివేయడం వల్ల భూసారానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల సమృద్ధిగా వర్షాలు కురవడంతో జిల్లాలోని దుబ్బాక, గజ్వేల్, సిద్దిపేట వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలోని పలు గ్రామాల రైతులు యాసంగి పంట సాగు కోసం తమ పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. యంత్రాల ద్వారా వరి కోతలు కోయడం వల్ల వరి కొయ్యలు పొలంలో ఎక్కువ ఎత్తులో మిగిలిపోతున్నాయి. దీనివల్ల పొలాన్ని దున్నడం కష్టంగా మారడంతో రైతులు ఈ వ్యర్థాలకు నిప్పు పెట్టి కాల్చివేస్తున్నారు. అయితే, ఇది వాతావరణ కాలుష్యానికి దారి తీయడమే కాక, భూమి తన సహజ సారాన్ని కోల్పోతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. గతంలో కూలీలను పెట్టి కోయించడం వల్ల పశువులకు గడ్డి లభించేది, కొయ్యలు కూడా చిన్నగా ఉండేవి. ఆ కొయ్యలను పొలంలో కలియ దున్ని నీరు పారించడంతో అవి కుళ్లిపోయి భూమి సారవంతమయ్యేది.

భూసారం తగ్గిపోతోంది


వరి కొయ్యలను కాల్చడం వల్ల పొలంలో పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు, క్రిమి కీటకాలు నశించిపోతాయి. దీని ఫలితంగా నేల తన సహజ స్వభావాన్ని కోల్పోయి క్రమంగా సారవంతం తగ్గుతుంది. భూసారం తగ్గడం వల్ల పంట దిగుబడి తగ్గి రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంటుంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా, వరి కొయ్యలను పొలంలోనే కలియ దున్నడం వల్ల అవి కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారతాయి. దీనివల్ల భూసారం పెరిగి, అధిక దిగుబడి సాధించేందుకు వీలవుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వరి కొయ్యలను కాల్చివేసేటప్పుడు నిర్లక్ష్యంగా ఉంటే, పొలంలోని విద్యుత్ వైర్లు, మోటార్లు, నీటి పైపులు కాలిపోయి రైతులు నష్టపోవాల్సిన సందర్భాలు ఉన్నాయి. కాబట్టి, రైతులు ఈ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నారు.



ఇలా చేస్తే మేలు..

వరి కోసిన తర్వాత పంట వ్యర్థాలను తగులబెట్టకుండా, పొలానికి కొద్దిగా నీటి తడులు ఇచ్చి, సూపర్ ఫాస్ఫేట్ చల్లుకుని, ట్రాక్టర్ కేజీ వీల్స్‌తో దున్నాలని చెబుతున్నారు. ఈ విధానం ద్వారా పంట వ్యర్థాలు భూమిలో కలిసిపోయి కుళ్లిపోతాయి. ఆ తర్వాత కొద్ది రోజులు భూమిని ఆరబెట్టి, పంట సాగుకు సిద్ధం చేసుకుంటే రైతులకు మేలు జరుగుతుంది. ఈ పద్ధతి పాటించడం వల్ల వాతావరణ కాలుష్యాన్ని నివారించడంతో పాటు భూమికి సారాన్ని అందించినట్లవుతుంది.

అవగాహన కల్పిస్తున్నాం..



వరి పంటను కోసిన తర్వాత వరి కొయ్యలను పొలాల్లోనే కలియ దున్నాలి. వరి కొయ్యలను కాల్చివేయడం వల్ల జరిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వ్యర్థాలు కాల్చడం వల్ల మిత్ర పురుగులు, శత్రు పురుగులు కూడా నశిస్తాయి. దీనివల్ల భూసారం తగ్గి దిగుబడులు తగ్గుతాయి.

-కాంపాటి మల్లయ్య, ఏడీఏ దుబ్బాక

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు
- స్పెషల్ క్లాసుల ద్వారా పరీక్షలపై అవగాహన



వెల్దుర్తి పాఠశాల ఆవరణలో చదువుకుంటున్న విద్యార్థులు

వెల్దుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్‌కు తొలిమెట్టుగా భావించే పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి. ఇందులో భాగంగా మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు విద్యార్థులకు సబ్జెక్టులపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షల్లో విద్యార్థులు చేసిన తప్పులను సరిదిద్ది సందేహాలను నివృత్తి చేస్తున్నారు. పరీక్షలో ప్రశ్నలు ఎలా వచ్చినా సమాధానం రాయగలిగే విధంగా తీర్చిదిద్దుతున్నారు. 2024-25లో వెల్దుర్తి పాఠశాలకు చెందిన గుంటుకు భావన 581 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ యేడాది కూడా ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచిపేరు తెచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. మండలంలో కుకునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 89, బండపోసన్‌పల్లిలో 34, వెల్దుర్తిలో 167, వెల్దుర్తి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 39, మంగళపర్తిలో 28, మనేపల్లి పాఠశాలలో 24 మంది విద్యార్థులు పదవ తరగతి చదువుకుంటున్నారు.

ప్రత్యేక దృష్టి సారించాం



సమిష్టి కృషితో మంచి ఫలితాల కోసం కృషి చేస్తున్నాం. ఈసారి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాం. వెనుకబడిన విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో విద్య బోధిస్తున్నాం. విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగేల ప్రోత్సహిస్తున్నాం. విద్యార్థులు కష్టపడి చదువుతున్నారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సహకరిస్తున్నారు.

- సాంబయ్య, హెచ్ఎం, వెల్దుర్తి పాఠశాల

న్యూస్ బాక్స్

రైతులను మోసగించిన పీఏసీఎస్ సీఈవో

చిన్నశంకరంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మళ్లీ రుణమాఫీ చేస్తుందని నమ్మించి రైతులను మోసం చేసి పీఏసీఎస్ సీఈవో పాషా వడ్డీ వసూలు చేసిన సంఘటన చిన్నశంకరంపేట మండలం దర్పల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు, మాజీ సర్పంచ్ సిద్ధిరాంరెడ్డి తన భార్య పేరిట చందంపేట సహకార సంఘంలో 2020లో రూ.లక్షన్నర చొప్పున, మూడు లక్షల క్రాప్ లోన్ రుణం తీసుకున్నట్లు తెలిపారు. అప్పటి నుంచి తీసుకున్న రుణానికి వడ్డీ కట్టుకుంటూ వస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ కాలేదు. సీఈవో పాషా రెండో విడుతలో రుణమాఫీ వస్తుందని చెప్పడంతో చెక్కుల రూపంలో వడ్డీ కట్టినట్లు రైతు తెలిపారు. మూడు లక్షల రుణానికి వడ్డీతో కలిపి రూ.4.50 లక్షలు అయ్యిందనాడు. వడ్డీ కట్టినా అధిక వడ్డీ ఎలా అవుతుందని సీఈవోను నిలదీశాడు. ఈ విషయమై కొంతమంది రైతులతో కలిసి డీసీవో కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

కంది, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని హెచ్ఎం వెంకటరాజయ్య పేర్కొన్నారు. గురువారం కంది మండలంలోని చేర్యాల జడ్పీహెచ్ఎస్‌లో ఇంట్రామ్యూరల్ (గోడల వెలుపల) ఆటల పోటీలు నిర్వహించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జనార్ధన్ పర్యవేక్షణలో విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు.

పొగమంచుతో జాగ్రత్త

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉదయం, సాయంత్రం వేళల్లో రహదారులపై పొగమంచు అధికంగా పేరుకుతున్నదని, వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని కల్హేర్, సిర్గాపూర్ ఎస్ఐలు రవిగౌడ్, మహేష్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. వాహనాలపై ప్రయాణించేవారు హెడ్ లైట్లు వేసుకుని నిర్ణీత వేగంతో వాహనాలు నడపాలన్నారు.

వ్యాసరచన పోటీలు

తూప్రాన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఆధ్వర్యంలో 72వ జాతీయ సహకార వారోత్సవాల ముగింపు గురువారం చేపట్టినట్లు బ్యాంకు బ్రాంచీ మేనేజర్ ప్రసాద్‌గౌడ్ తెలిపారు. గుండ్రెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాంకు అందించే సేవలు, సైబర్ సెక్యూరిటీపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, అందజేశారు.

మహాకాళిమాత ఆలయంలో పూజలు

వెల్దుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మన్నెవారి జలాల్‌పూర్ మహాకాళిమాత ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.50 వేల ఆర్థికసాయం

నారాయణఖేడ్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతిచెందగా, నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్‌కు చెందిన ప్రతాప్ తీవ్రగాయాలతో బయటపడిన విషయం తెలిసిందే. నిమ్స్ ఆస్పత్రి చికిత్స చేయిస్తున్నారు. ఆస్పత్రి ఖర్చుల కోసం సంజీవన్‌రావుపేట మాజీ సర్పంచ్ రాంరెడ్డి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని బాధితునికి అందించారు. మృతిచెందిన మనూరు మండలం ఎల్గోయికి చెందిన అధ్యాపకుడు నాగరాజు కుటుంబానికి రూ.40 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. గురువారం నారాయణఖేడ్ శివారులోని కన్వెన్షన్ హాల్‌లో 105 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు 56 మందికి రూ.16.4 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజుపటేల్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు వినోద్‌పాటిల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహేర్, శంకర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం

- జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ప్రతాప్‌సింగ్



రామాయంపేటలో మాట్లాడుతున్న దేవ్‌కుమార్

రామాయంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందొచ్చని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ప్రతాప్‌సింగ్ తెలిపారు. రామాయంపేట రైతువేదికలో గురువారం నిర్వహించిన సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్‌తో పాటు ఆయన హాజరై ఆయిల్‌పామ్ లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి పంటను కొనుగోలు చేస్తుందన్నారు. దీర్ఘకాలిక పంట కావడంతో రైతుకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం రామాయంపేట వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్‌నారాయణ పంటల సాగులో నూతన సాంకేతిక పద్ధతులను తెలియజేశారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సంగారెడ్డి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బీహెచ్ఈఎల్ పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జాతీయ నాయకుడు ఏకే.దాస్ పరిశ్రమ చైర్మన్‌ను కోరారు. ఈ మేరకు న్యూఢిల్లీలో బీహెచ్ఈఎల్ చైర్మన్, ఎండీ.సదాశివమూర్తికి గురువారం ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ బీహెచ్ఈఎల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికీ కేంద్ర ప్రభుత్వ జీవోల ప్రకారం వేతనాలు ఇవ్వాలని, కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, గ్రాడ్యూటీ ఇతరత్రా చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంఏ.రహ్మాన్, వెంటరాజ్యం, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బూత్ లెవల్ ఏజెంట్ల జాబితాను సమర్పించాలి



మాట్లాడుతున్న మెదక్ ఆర్డీవో రమాదేవి

మెదక్ అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలోని రాజకీయ పార్టీలన్నీ బూత్ లెవల్ ఏజెంట్ల జాబితాను సమర్పించాలని ఆర్డీవో రమాదేవి సూచించారు. గురువారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలో 278 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, ప్రతీ పోలింగ్ బూత్ లెవల్ ఏజెంట్లను అన్ని పార్టీలు నియమించిన జాబితాను వెంటనే సమర్పించాలన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



జోనల్ కమిషనర్ పంకజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి

రామచంద్రాపురం టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భారతీనగర్ డివిజన్ పరిధి కాలనీల్లో ప్రతిపాదిత అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి కోరారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ పంకజ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కాలనీల్లో సీసీరోడ్లు, మురుగు పైపులైన్లు, పార్కులు అభివృద్ధి చేయడం, వీధిదీపాలు ఏర్పాటు చేయడం వంటి పనులకు రూ.4 కోట్లు మంజూరు చేయాలని కోరారు.

వందేమాతరం గీతాలాపనకు ఏర్పాట్లు



వందేమాతరం గీతాలాపనకు ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 1న 30 వేల మంది విద్యార్థులతో వందేమాతరం గీతాలాపన చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు నోవాపాన్ కూడలిలో స్థల పరిశీలన చేశారు. ఒకే ప్రాంతంలో 30 వేల మంది విద్యార్థులు ఒకే సమయంలో గేయాన్ని ఆలపించడానికి వీలుగా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 1న వందేమాతరం గీతాలాపన చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయకరెడ్డి, నేషనల్ హైవే అథారిటీ డిఈ రామకృష్ణ పాల్గొన్నారు.

బ్రిడ్జి పనుల కోసం అధికారుల పరిశీలన

చేగుంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చేగుంట-మెదక్ రోడ్డుకు వెళ్లే దారిలో 228 రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్వో బ్రిడ్జి పనులను చేపట్టేందుకు అధికారులు గురువారం సంయుక్తంగా పరిశీలన చేపట్టారు. ఆర్వో బ్రిడ్జి నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ లైన్లు, మిషన్ భగీరథ వాటర్ లైను, కమ్యూనికేషన్ కేబుల్, చెట్లను తొలగించే విధంగా సంబంధిత శాఖలకు సూచనలు ఇచ్చారు. ఆర్వో బ్రిడ్జి పనుల వల్ల ప్రయాణికులకు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పోలీస్ శాఖతో కలిసి ప్రత్యామ్నాయ రహదారి మార్గాలను ఏర్పాటు చేయడంతో పాటు వాహనదారులకు స్పష్టమైన మార్గదర్శక సూచనలు అందించేందుకు సైన్‌బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు జగదీష్, సుధాకర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, ఆర్‌బీడీఈ నాగరాజు, మిషన్ భగీరథ అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆక్యుపెన్సీ పత్రం లేకున్నా విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి

పటాన్‌చెరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆక్యుపెన్సీ పత్రం లేకున్నా విద్యుత్ కనెక్షన్ ఇచ్చేటట్టు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ కోరారు. గురువారం రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ ఎండీ.ముషారఫ్ అలీ ఫారూఖ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జీహెచ్ఎంసీ ప్రాంతంలో నివాస యోగ్యతా ధ్రువీకరణ పత్రం జారీ చేయడం లేదని చెప్పారు. ఫలితంగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి అధికారులు నిరాకరిస్తున్నారని వివరించారు. దీనిపై అధ్యయనం చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా వీరభద్రస్వామి ఆలయంలో హోమం

గుమ్మడిదల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్నగూడెంలో వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్‌గుప్తా, పర్యవేక్షకుడు సోమయ్య ఆధ్వర్యంలో అర్చకులు హోమాన్ని చేపట్టారు. గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

బాలుడికి 'ఎపిలెప్సీ' శస్త్రచికిత్స విజయవంతం



మాట్లాడుతున్న డా.సాగరి గుల్లపల్లి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది గ్రామంలో మూర్ఛ సమస్యతో బాధపడుతున్న ఏడేళ్ల బాలుడికి హైదరాబాద్ హైటెక్‌సిటీ యశోద ఆస్పత్రిలో 'ఎపిలెప్సీ' శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్టు యశోదా ఆస్పత్రి న్యూరో కన్సల్టెంట్ డా.సాగరి గుల్లపల్లి తెలిపారు. యశోదలో చికిత్స పొందిన కపిల్‌రెడ్డి ధర్మారెడ్డి బాలుడితో కలిసి గురువారం సంగారెడ్డిలోని ఐఎంఏ హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. యాంటీ ఎపిలెప్టిక్ మందులు వాడుతున్నా ఆ బాలుడు తల, కళ్లలో టానిక్ డీవియేషన్ లక్షణాలతో కొంత స్పృహ కోల్పోతున్నారని వివరించారు. ఫిబ్రవరిలో బాలుడికి ఎలక్ట్రోకార్టికోగ్రామ్‌తో లెఫ్ట్ ఇమేజ్ గైడెడ్ క్రానియోటమీ, లెసియోనెక్టమీ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అధునాతన ఈసీఓజీ మ్యాపింగ్ గైడెడ్ రిసెక్షన్ ఎపిలెప్టోజెనిక్ ఫోకస్ ద్వారా సమస్యను ఖచ్చితంగా గుర్తించి శస్త్ర చికిత్స నిర్వహించామన్నారు.

పలు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు



నర్సాపూర్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నర్సాపూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో షుగర్, బీపీతో పాటు వివిధ రోగాలకు సంబంధించిన పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ భూపాల్‌తో పాటు సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పరీక్షలు చేయించుకున్నారు.

రామాయంపేటలో...

రామాయంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేటలో మొదటిసారి ఉచిత వైద్య శిబిరం వైశ్య భవన్‌లో గురువారం ఏర్పాటైంది. లయన్స్ క్లబ్ నేతృత్వంలో నిర్వహిస్తున్న శిబిరంలో కండరాలు, నరాల బలహీనత, పక్షవాతం వంటి దీర్ఘకాలిక వ్యాధులను నయం చేస్తారు. ఈ శిబిరాన్ని సీఐ వెంకటరాజాగౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దేమే యాదగిరి, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మెదక్ అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక సంఘ భవనం వద్ద ఓ కంటి ఆసుపత్రి వారు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఆపరేషన్‌కు రెఫర్ చేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సత్వర సేవలందించాలి



మాట్లాడుతున్న డా శ్రీరామ్

రామాయంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రోగులకు సత్వర సేవలందించాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ అన్నారు. నెలవారీ సమీక్షలో భాగంగా రామాయంపేట మండలం దర్మారం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో గురువారం సమీక్ష నిర్వహించారు. నెలరోజులపాటు ఆస్పత్రిలో జరిగిన వైద్య చికిత్సల వివరాలు, గర్భిణుల ప్రసవాల గురించి తెలుసుకున్నారు. అలాగే రోగులకు కావాల్సిన మందుల వివరాలు, ఔట్, ఇన్‌పేషెంట్ల సంఖ్యను పరిశీలించారు.

వారంలో వీధి వ్యాపారులను గుర్తించాలి

తూప్రాన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వారంరోజుల్లో వీధి వ్యాపారులను గుర్తించి బ్యాంకులకు దరఖాస్తులు పంపించాలని మెప్మా ప్రాజెక్టు డైరక్టర్ హన్మంతారెడ్డి పేర్కొన్నారు. వీధి వ్యాపారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం సేవా నిధి ఆత్మ నిర్భర్ నిధి మరో ఐదేళ్లు పొడిగించినట్లు తెలిపారు. గురువారం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో మెప్మా రిసోర్స్ పర్సన్‌లతో సమావేశం నిర్వహించారు. 2020-2025 కొనసాగిన వీధి వ్యాపారుల పథకం మరో ఐదేళ్లుగా 2025-2030 వరకు పొడిగించినట్లు తెలిపారు. ప్రతి రిసోర్స్ పర్సన్ 50 మంది వీధి వ్యాపారులను గుర్తించి, సహాయం అందజేసేందుకు బ్యాంకులకు దరఖాస్తులు సమర్పించాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను వేగంగా పూర్తి చేయాలి

చిన్నశంకరంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని మెదక్ డివిజన్ హౌజింగ్ డీఈ యాదగిరి అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు కొర్వీపల్లి గ్రామాలను హౌజింగ్ డీఈ, హౌజింగ్ ఏఈ, ఎంపీడీవో సందర్శించి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఏఈ లోకేష్, ఆర్ఐ రాజు పాల్గొన్నారు.

పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా శంకర్



శంకర్

పుల్‌కల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అందోలు మండల అధ్యక్షుడిగా కె.శంకర్ ఎన్నికయ్యారు. అందోలు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశానికి వట్‌పల్లి, అందోలు, పుల్కల్, చౌటకూర్ మండలాలకు చెందిన పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులు హాజరయ్యారు. సమావేశానంతరం పుల్కల్ ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షకుడు(చౌటకూర్ ఎంపీడీవో)గా బాధ్యతలు నిర్వహిస్తున్న శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్లు ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా పి.విఠల్‌రెడ్డి (సీనియర్ సహాకులు ఈఈ పీఆర్ డివిజన్ అందోలు), ఉపాధ్యక్షుడిగా కె.రాములు, మహిళా ఉపాధ్యక్షురాలిగా కె.శైలజ, కోశాధికారిగా టి.శ్రీధర్, సంయుక్త కార్యదర్శులుగా గులాం మహ్మద్‌ఖాన్, బి.శ్రీకాంత్ కన్నా, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పి.శివసాగర్, ఎస్.వినయ్‌సాగర్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా వీవీ.రామకృష్ణారెడ్డి, పి.శ్రీనివాస్, జి.రాధిక, జి.మల్లికార్జున్, ఎం.మాణిక్‌ప్రభాకర్, పి.రమేశ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూర్యకాంత్, రఘు, నాయకులు నరసింహరెడ్డి, నాగేందర్, సుభాష్‌లు పాల్గొనగా, ఎన్నికల అధికారులుగా అందోలు ఎంపీడీవో రాజేశ్, ఎంఈవో బి.కృష్ణ వ్యవహరించారు.

బందంకుంటలో శాంపిల్స్ సేకరణ

జిన్నారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండలం గడ్డపోతారం పరిధిలోని బందంకుంటలో చేరుతున్న పరిశ్రమల రసాయనాలపై స్థానికుల ఫిర్యాదుతో పీసీబీ అధికారులు శాంపిల్స్ సేకరించారు. గురువారం గడ్డపోతారం పరిధి అల్లీనగర్ గ్రామ శివారులో గల బందంకుంటను పీసీబీ అధికారులు పరిశీంచారు. ఇటీవల కుంటలో చేరుతున్న రసాయనాలతో కాలుష్యకారకంగా మారటంతో స్థానికుల ఫిర్యాదుతో శాంపిల్స్ సేకరించి పరీక్షల కోసం పంపించారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



మహా పడిపూజలో సీఎండీ కరుణాకర్, భక్తులు

జిన్నారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండలం కొడకంచిలో గురువారం ఆదినారాయణస్వామి ఆలయం వద్ద అయ్యప్పస్వామి మహా పడిపూజను శాంపిస్టన్స్ పరిశ్రమ సీఎండీ కరుణాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వందల సంఖ్యలో అయ్యప్ప స్వాములు, పరిశ్రమ కార్మికులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు. పురాతన ఆలయమైన ఆలయాన్ని శాంపిస్టన్స్ పరిశ్రమ ఆధునీకరించగా.. ప్రతియేటా స్వామి సన్నిధానం వద్ద అయ్యప్ప మహా పడిపూజను నిర్వహిస్తున్నారు.

కుట్రలో భాగమే కేటీఆర్‌పై కక్షసాధింపు చర్యలు

గుమ్మడిదల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై జరుగుతున్న విచారణలు రాజకీయ కక్షసాధింపులో భాగమేనని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. గురువారం గుమ్మడిదల మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి అవినీతి జరగని ఫార్ములా ఈ రేస్ అంశంపై ఏసీబీ విచారణకు గవర్నర్ అనుమతి ఇవ్వడం ద్వారా కాంగ్రెస్, బీజేపీలు కలిసి బీఆర్ఎస్‌ను బలహీనపరచాలని కుట్ర చేస్తున్నారనేది తేటతెల్లమైందన్నారు.

అనాథాశ్రమానికి వృద్ధురాలి తరలింపు

సంగారెడ్డి రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని శివాజీనగర్ 23వ వార్డులో కొన్నిరోజులుగా రోడ్డు పక్కన తలదాచుకుంటున్న అనాథ వృద్ధురాలిని గురువారం అధికారులు అనాథాశ్రమానికి తరలించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి మాట్లాడుతూ వృద్ధురాలి పరిస్థితిని గమనించిన 23వ వార్డు మాజీ కౌన్సిలర్ కూన సంతోష్‌కుమార్, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణు విషయాన్ని తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ విషయాన్ని ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి రమేష్‌కు వివరించగా ఆమె ఉంటున్న ప్రదేశానికి చేరుకుని వివరాలు సేకరించి అమీన్‌పూర్‌లోని మహిమ మినిస్ట్రీస్ నిర్వహిస్తున్న అనాథ వృద్ధాశ్రమానికి తరలించినట్టు పేర్కొన్నారు.

కనుల పండువగా భవానీ చిదంబరస్వామి కల్యాణం



రథంపై ఊరేగుతున్న భవానీ చిదంబరస్వామి

మెదక్ అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీకమాసం చివరిరోజు గురువారం జిల్లా కేంద్రంలోని రామాలయ శివాలయంలో భవానీ చిదంబరస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు అమ్మన్నగారి కృష్ణరావుశర్మ ఆధ్వర్యంలో పండితుల ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.స్వామివారి దివ్య రథోత్సవం వైభవంగా జరిగింది.